# స్వర్ణవాగుపై చెక్‌డ్యాం

- దశాబ్దపు కల నెరవేర్చుతున్న సర్కారు
- రూ.8 కోట్లు మంజూరు
- ఇటీవల పనులకు మంత్రి అల్లోల శంకుస్థాపన
- వెంగ్వాపేట్ చెక్‌డ్యామ్‌తో పెరుగనున్న భూగర్భ జలాలు
- సాగునీటికి ఇక ఢోకా లేనట్లే..

సోన్, అక్టోబర్ 19 : ప్రభుత్వం దశాబ్దపు కళను నెరవేర్చుతున్నది. నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలోని స్వర్ణవాగుపై చెక్‌డ్యాం నిర్మించాలని గ్రామస్తులు ఇరవై ఏళ్లుగా కోరుతున్నారు. అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం చెక్‌డ్యాం నిర్మాణానికి రూ. 8కోట్ల నిధులను మంజూరు చేసింది. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక కృషితో జల వనరుల శాఖ స్వర్ణవాగుపై వెంగ్వాపేట్ వద్ద చెక్‌డ్యాం నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం ఆమోదించి నిధులు మంజూరు నిధులు కూడా కేటాయించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వెంగ్వాపేట్ గ్రామంలో 90 శాతం వ్యవసాయం నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. స్వర్ణ ప్రాజెక్టు నుంచి జౌళీనాల ద్వారా వరి సాగు చేసే రైతులకు స్వర్ణవాగుపై చెక్‌డ్యాం నిర్మిస్తే భూగర్భజలాల పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. ఇప్పటికే 2014 తర్వాత తెలంగాణ ప్రభుత్వం మంత్రి సహకారంతో స్వర్ణ వాగుపై వెంగ్వాపేట్ ఎగువ భాగమైన సారంగాపూర్ మండలం ఆలూరు, దిగువన చిట్యాల్ వద్ద చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది. వెంగ్వాపేట్ గ్రామం వీటి మధ్యన ఉండడంతో తమ గ్రామంలో కూడా చెక్‌డ్యాం నిర్మించాలని గ్రామ రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో మంత్రి ప్రత్యేక చొరవతో చెక్‌డ్యాం పనులను ఇటీవల శంకుస్థాపన చేయడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.


వెంగ్వాపేట్ గ్రామ సమీపంలో చెక్‌డ్యాం నిర్మించనున్న ప్రాంతం ఇదే..

**సాగు, తాగునీటికి భరోసా..**

వెంగ్వాపేట్ గ్రామ శివారులో చెక్‌డ్యాం నిర్మించడం వల్ల సాగు, తాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.. వెంగ్వాపేట్ గ్రామానికి కిలోమీటరు దూరంలోనే స్వర్ణవాగు ప్రవహిస్తుండడంతో స్వర్ణవాగుపై అడ్డుకట్ట నిర్మిస్తే భూగర్భజలాలు నాలుగు కిలోమీటర్ల మేర నిల్వ ఉండే అవకాశం ఉంది. దీనివల్ల భూగర్భజలాలు పెరుగనున్నాయి. ప్రస్తుతం వెంగ్వాపేట్ గ్రామంలో చాలా మంది జౌళీనాల ద్వారా చెరువులను నింపుకొని ఆయకట్టు కింద పంటలను సాగు చేస్తున్నారు. వ్యవసాయ బోర్లు, బావులకు నీళ్లు వస్తాయని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. దీనికితోడు గ్రామంలోని పశువులకు దాహార్తి తీర్చుకునేందు కు ఏడాదంతా నీరు పుష్కలంగా లభించనుంది. గ్రామం నుంచి సారంగాపూర్ మండలం కాల్వ, బీరవెల్లి, తదితర గ్రామాలకు వెళ్లేందుకు చెక్‌డ్యాం బ్రిడ్జి ఉపయోగపడడంతో వర్షాకాలంలో ప్రజలకు రవాణా సదుపాయం కలుగనుంది. ప్రస్తుతం బ్రిడ్జి లేకపోవడంతో స్వర్ణవాగులో నీరు ప్రవహిస్తే రవాణా సదుపాయానికి ఆటంకం ఏర్పడుతున్నది. దీంతో మంజులాపూర్, అటు సారంగాపూర్ నుంచి తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రభుత్వం తాజాగా బీరవెల్లిని మండలంగా ప్రకటించిన నేపథ్యంలో నిర్మల్ రావడానికి ఈ స్వర్ణవాగుపై చెక్‌డ్యాం, బ్రిడ్జి నిర్మించడం వల్ల రవాణా మార్గాన్ని మరింత దగ్గరగా మార్చే అవకాశం ఉందని రెండు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

### భూగర్భ జలాలు పెరుగుతాయి..



చెక్‌డ్యాం నిర్మాణంతో భూగర్భజలాలు పెరుగుతాయి. పంటలను మరింత పండించుకోవచ్చు. మా గ్రామంలో చెక్‌డ్యాం నిర్మించాలని 20 ఏళ్లుగా రైతులను కోరుతున్నాం. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక కృషితో రూ. 8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. దీంతో పనులను కూడా ప్రారంభం కానున్నాయి. చెక్‌డ్యాం నిర్మిస్తే నిర్మల్, బీరవెల్లి మండలాలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుంది. సాగు, తాగునీరు అందించేందుకు ఈ చెక్‌డ్యాం ఎంతో ఉపయోగపడనుంది.

**- కొప్పుల నర్సయ్య, రైతు(వెంగ్వాపేట్)**

### తెలంగాణతోనే సాధ్యమైంది..



చెక్‌డ్యాం నిర్మాణం తెలంగాణ రావడం వల్లే సాధ్యమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చెక్‌డ్యాంల నిర్మాణం ఒక్కటి కూడా జరుగలే. ప్రస్తుతం నీరును నిల్వ ఉంచేందుకు చెక్‌డ్యాంల నిర్మాణం మంచి ఆలోచన. పరిసర గ్రామాల రైతులకు నీరు ఏడాదంతా నిండుగా ఉంటుంది. దీంతో రైతులకు పంటలు పండించుకునేందుకు ఎటువంటి ఢోకా ఉండదు. అలాగే మత్స్య కార్మికులకు చేపలను పట్టుకునేందుకు కూడా ఉపాధి లభిస్తుంది.

**- గాడి నాగభూషణ్, మాజీ సర్పంచ్(వెంగ్వాపేట్)**

## నేడు మంత్రి అల్లోల పర్యటన

మామడ, అక్టోబర్ 19 : రాష్ట్ర అటవీ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం ఉదయం 11 గంటలకు పొన్కల్ గ్రామంలో పర్యటించనున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ చిక్యాల హరీశ్‌కుమార్,రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు కాలగిరి గంగారెడ్డి తెలిపారు. పొన్కల్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేసినందుకు గానూ పొన్కల్ మండల పరిధిలోని 10 గ్రామాల ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి కృతజ్ఞత సభ ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.10 గ్రామాల ప్రజలు తరలిరావాలని వారు కోరారు.

## విద్యుత్ షాక్‌తో మేస్త్రీ మృతి

తానూర్, అక్టోబర్ 19 : మండల కేంద్రంలో ఇంటి నిర్మాణం పనులు చేస్తున్న సలీం (23) మేస్త్రీ విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ లోకం సందీప్ తెలిపారు. పశ్చిమబెంగల్‌కు చెందిన వలస కూలీ ప్రమాదవశాత్తు 33కేవీ విద్యుత్ తీగలు తగలడంతో అక్కడిక్కడే కుప్పకూలగా వెంటనే భైంసా దవాఖానకు తరలించారు. దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఆయన చెప్పారు.

## అభివృద్ధి, సంక్షేమానికే పట్టం కట్టండి

నేరడిగొండ, అక్టోబర్ 19 : తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పట్టం కట్టాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్ తెలిపారు. బోందిడి, దర్భ, దర్భ తండా గ్రామాల్లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ వచ్చాకే గిరిజన తండాలు, గూడేలు అభివృద్ధికి నోచుకున్నాయన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సయ్యద్ జహీర్, గాదె శంకర్ పాల్గొన్నారు.

## నల్దుర్తిలో బోనమెత్తిన మహిళలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మామడ, అక్టోబర్ 19 : మండలంలోని నల్దుర్తి గ్రామంలో గురువారం పవనసుత యూత్ ఆధ్వర్యంలో బోనాల పండుగ ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధుల గుండా బోనాలను నృత్యం చేసుకుంటూ డీజే సౌండ్‌తో ఉరేగింపుగా తీసుకెళ్లి దుర్గామాతకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజ లు చేశారు. శనివారం దుర్గామాత విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పవన సూత యూత్ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## యోగా శిబిరాన్ని వినియోగించుకోవాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్19 : ఈ నెల 22 నుంచి మూడురోజుల పాటు హెల్ప్ వీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ వ్యవ స్థాపకుడు కాంబ్లే అతీశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలకేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో యోగా శిక్షణ శిబిరం ఉంటుందని, ప్రతిఒక్కరూ గంట సేపు యోగా చేయాలని కోరారు. శిబిరానికి వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా రావచ్చని ఆయన కోరారు.

## వాహనదారులు నిబంధనలు పాటించాలి

నర్సాపూర్(జీ), అక్టోబర్ 19 : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, అన్ని పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. గ్రామంలో సరైన పత్రాలు లేని 66 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అధికంగా పెండింగ్ చలాన్లు ఉన్న వారు కట్టాలని సూచించారు. సైబర్ క్రైమ్స్ పెరుగుతున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అక్రమంగా మద్యం,గుడుంబాను నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పోలీసులకు ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు రవీందర్, అరాఫత్ అలీ, కృష్ణసాగర్, రెడ్డి, చంద్రమోహన్, అశోక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్

## వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ఇచ్చోడ, అక్టోబర్ 19 : ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని డాక్టర్ బీ నరేశ్ అన్నారు. మండలంలోని గెర్జం గ్రామంలోని అంగన్‌వాడీ 1, 2లో ఆర్‌బీఎస్‌కే వైద్య శిబిరాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నా రు. తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారని డీఈఐసీ ఆదిలాబాద్‌కు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో అరుణ్, రోజా, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## కుంకుమార్చన పూజలు

బోథ్, అక్టోబర్ 19 : మండలకేంద్రంతో పాటు కౌఠ (బీ), కన్గుట్ట, ధన్నూర్ (బీ), కుచ్లాపూర్, పొచ్చెర గ్రామాల్లోని మహిళలు మంగళహారతులతో మండపాల వద్దకు తరలివచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నేడు హస్నాపూర్‌లో పారాయణం

ఉట్నూర్, అక్టోబర్ 19 : మండలంలోని హస్నాపూర్ గ్రామంలో గల శ్రీ మాతా దుర్గాదేవి మండపంలో ఈ నెల 20న హరి భక్త పారాయణం ముక్తతాయనాత్మలి నిర్వహించనున్నట్లు గోర్ యువసేనా సభ్యుడు విక్రం నాయక్ తెలిపారు.